ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - ఏలూరు

దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం సరికొత్త వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45 శాతం నుంచి 67 శాతం డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు ఆప్కో రాజమండ్రి మండల వాణిజ్య అధికారి కె.పెద్దిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని సిఆర్ రెడ్డి షోరూమ్, నేత బజార్ భవనం, సర్ సిఆర్ రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న ఆప్కో విక్రయ శాలల్లో పై ఆఫర్లు అందించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఆప్కో విక్రయ శాలలు సందర్శించి దసరా, దీపావళి సందర్భంగా తమకు కావాల్సిన రాజమండ్రి, బందరు, వెంకటగిరి, మాధవరం, ఉప్పాడ చీరలు, షర్టింగ్, దోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్ మొదలగు చేనేత వస్త్రాలు కొనుగోలుచేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి చేనేత కార్మికులను ఆదరించాలని తెలిపారు.

కౌలు రైతులకు దక్కని
అన్నదాత సుఖీభవ



ఖరీఫ్ సాగు చివరి దశకు చేరినా అందని పెట్టుబడి సాయం

జిల్లా సాగులో 80 శాతం కౌలురైతుల చేతుల్లోనే

ఇప్పటికీ పూర్తికాని కౌలుకార్డుల జారీ ప్రక్రియ

రెండు జిల్లాల్లో లక్షా 80 వేల కౌలుకార్డుల జారీ లక్ష్యం

అప్పల సాగుతో అన్నదాత అవస్థలు

కౌలుచట్టంపైనా కూటమి సర్కార్ దొంగాట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు చివరి దశకు చేరింది. పొలాలు పలుచోట్ల పక్వానికి, కొన్నిచోట్ల పొట్టదశకు చేరుకున్నాయి. అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకూ కౌలురైతులకు మాత్రం ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందించే 'అన్నదాత సుఖీభవ' సొమ్ము మాత్రం అందని దుస్థితి నెలకొంది. జిల్లా వ్యవసాయసాగులో 80 శాతం కౌలురైతులే చేస్తున్నారు. వ్యవసాయ సాగులో కౌలురైతులదే కీలక పాత్ర అని అందరికీ తెలిసిందే. అయినప్పటికీ కూటమి సర్కార్ కౌలురైతుల పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్దసంఖ్యలో కౌలురైతులు ఉన్నప్పటికీ ప్రస్తుత ఏడాదిలో ఏలూరు జిల్లాలో 75 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా ఐదు వేల మందికి కౌలుకార్డులు జారీ చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకూ కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదు. రెండు జిల్లాల్లో 20 వేల వరకూ కౌలుకార్డులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇంకా 50 వేల మందికిపైగా రైతులకు కౌలుకార్డులు ఇవ్వాల్సి ఉంది. అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని చెబుతున్నా.. అవుతుందో లేదో తెలియని పరిస్థితి ఉంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తయిన తర్వాతే అన్నదాత సుఖీభవ సొమ్ము ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. కౌలురైతులకు పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకే ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడి సాయం అనేది సాగు ఆరంభంలో ఇవ్వాలి. ఖరీఫ్ సాగు చివరి దశకు చేరుతున్నా అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం మాత్రం కౌలురైతులకు అందలేదు. భూయజమానులకు మాత్రం ఆగస్టు ఐదో తేదీన ఏలూరు జిల్లాలో లక్షా మూడు వేలు మందికి, పశ్చిమలో లక్షా 60 వేల మందికి మొదటి విడత సొమ్ము ప్రభుత్వం జమ చేసింది. సాగులో కీలకమైన కౌలు రైతులకు మాత్రం అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలవుతోంది. ఇప్పటి వరకూ కౌలురైతులకు ఏ ఒక్క సాయమూ లేదు. కౌలురైతులకు బ్యాంకు రుణాలు సైతం సక్రమంగా ఇవ్వని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల మొత్తంగా చూసినా కౌలురైతులకు ఇచ్చిన రుణాలు రూ.వంద కోట్లు దాటని పరిస్థితి. ఇచ్చిన రుణాలు సైతం రైతుమిత్ర గ్రూపుల కింద ఇచ్చినవే. కౌలుకార్డుల ద్వారా ఇచ్చిన రుణాలు దాదాపు లేవనే చెప్పొచ్చు. కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము ఇచ్చే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా అనే సందేహాలు అలముకున్నాయి. ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కౌలు చట్టంపై దొంగాట

తాము అధికారంలోకి వస్తే వైసిపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన కౌలుచట్టాన్ని మార్పు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో చెప్పారు. వైసిపి తెచ్చిన చట్టంలో భూయజమాని అంగీకారంతోనే కౌలుదారులకు కౌలుకార్డులు ఇవ్వాలని నిబంధన పెట్టారు. దీంతో భూయజమానులు కౌలుదారులకు కార్డులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో కౌలురైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. సాగుచేయని భూయజమానులే ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం, బీమా పరిహారం వంటివి తీసుకుంటున్నారు. దీంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరుగుతున్న పరిస్థితి ఉంది. తాము అధికారంలోకి వస్తే కౌలుచట్టంలో మార్పులు తెచ్చి కౌలురైతులను ఆదుకుంటామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పేరుతో సమావేశాలు సైతం నిర్వహించారు. తర్వాత పూర్తిగా పక్కన పెట్టేశారు. దీని వెనుక కుట్ర ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి. కౌలుచట్టంపై ప్రభుత్వం దొంగాట ఆడుతుందనే చర్చ కౌలురైతుల్లో నెలకొంది. కౌలురైతులను కూటమి సర్కార్ మోసగించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విలీన మండలాలను వీడని వరద

మళ్లీ పెరుగుతున్న గోదావరి

ఆందోళనలో మిర్చి రైతులు

గుండేటి వాగు కాజ్‌వేపైకి నీరు

12 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

భద్రాచలంలో 37 అడుగులకు చేరిన నీటిమట్టం

కుక్కునూరు రూరల్ : గుండేటి వాగు కాజ్‌వేపై వరద

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఈ ఏడాది విలీన మండలాలను గోదావరి వరద వీడేలా కన్పించడం లేదు. గోదావరి వరద మూడు నెలలుగా పెరుగుతూ, తగ్గుతూ, నిలకడగా ఉంటూ ఇక్కడి ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. నిన్నటి వరకూ తగ్గుముఖం పట్టిన గోదావరి వరద గురువారం నుంచి మళ్లీ పెరుగుతోంది. బుధవారం భద్రాచలంలో 30 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం గురువారం 36.9 అడుగులకు చేరింది. మూడు రోజుల క్రితం గోదావరి వరద పూర్తిగా తగ్గడంతో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్వే పైనుండి యధావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. దీంతోపాటు మండలంలో రైతులు, కూలీలు మిర్చి మొక్క నాటే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో మళ్లీ గోదావరి వరద పెరుగుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టమిట్టాడుతున్నారు. మరోవైపు కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్వేపైకి వరద నీరు చేరడంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వరద ఉధృతి మరింత పెరిగితే ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వే నీట మునిగి మరో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచే ప్రమాదం ఉంది.



వేలేరుపాడు రూరల్ : నీట మునిగిన ఎద్దు వాగు

వేలేరుపాడు రూరల్: మళ్లీ గోదావరి వరద పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. యడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు నీట మునగడంతో కట్కూరు, కోయిదా, కాకిసినూరు, తాళ్లగొంది, పూచిగొంది తదితర సుమారు 15 గ్రామాలకు రహదారి సౌకర్యం లేక రాకపోకలు నిలిచిపోయాయి. కోయిదా చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు ఎద్దువాగు వరకు ఆటోపై వచ్చి బోటు దాటి మండల కేంద్రానికి చేరుకోవాల్సి వస్తోంది. వర్షాకాలం ఆసన్నమయ్యేసరికి ప్రతి సంవత్సరం ఎద్దు వాగు మునగడంతో ఎనలేని అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఎద్దు వాగు వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు ప్రజల రాకపోకలకు బోటు ఏర్పాటు చేశారు.

6,13,014 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం : ఎగువ ప్రాంతాలు, రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా తగ్గుతూ పెరుగుతూ తగ్గుతూ వస్తున్న గోదావరి వరద గురువారం సాయంత్రానికి నెమ్మదిగా పెరుగుతుంది. ప్రాజెక్ట్ స్పిల్‌వే నుండి 6,13,014 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. స్పిల్‌వే ఎగువన 30.740 మీటర్లు, స్పిల్‌వే దిగువన 21.600 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 31.200 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 21.250 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 16 మీటర్లు నీటిమట్టం నమోదైంది.

పరిశుభ్రతపై ప్రత్యేక దష్టి పెట్టాలి

శ్రమదానంతో ఆరోగ్యవంతమైన నవ సమాజం

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి బి.అనిల్‌కుమార్‌రెడ్డి

చెత్త ఏరుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి, వెట్రిసెల్వి, ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఎపి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి బి.అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పంపుల హెడ్ వాటర్ వర్క్స్ వద్ద గురువారం 'స్వచ్ఛతా హి సేవ-2025'లో భాగంగా 'ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాథ్' అనే థీమ్‌తో ఆయన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి మొక్కలు నాటారు. చెత్తా చెదారం ఏరివేసి ప్రత్యేక శుభ్రతా డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొంటే ఆరోగ్యవంతమైన పట్టణాలు, గ్రామాలుగా కళకళలాడతాయన్నారు. ఎక్కడ పరిశుభ్రత ఉంటుందో అక్కడ పండుగల ఆనందం రెట్టింపయ్యి, సంతృప్తి కలుగుతుందన్నారు. మంచి సేవలందించిన క్లాప్ మిత్రాలకు అక్టోబరు 2న విజయవాడలో జరిగే ముగింపు కార్యక్రమంలో విజరాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే విజయవాడలో సభలో బహుమతులు, సన్మానాలు చేసి గౌరవిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ-2025 కార్యక్రమం జిల్లా అంతటా పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ఒక్క రోజుతో పరిమితం కాకుండా ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థి దశ నుండే పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, పర్యావరణం పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చెత్త వేసి క్లీన్ చేయడం కన్నా ముందే తగిన జాగ్రత్తలు తీసుకుని చెత్తను డస్ట్‌బిన్లలో వేయాలన్నారు. మంచి ఆలోచనలు, ఆరోగ్యకర, స్థిరమైన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత తప్పక పాటించి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ ముందడుగులు వేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఏలూరు యుడిఎ ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, కార్పొరేటర్లు పాము పద్మ, మున్నల కేదారేశ్వరి, వంకదార ప్రవీణ్‌కుమార్, సంపన శ్రీనివాస్, లక్ష్మణరావు, మెప్మా సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, స్థానికులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థుల నరకయాతన..!

మీటింగ్ అయ్యాక గంటల తరబడి కానరాని బస్సులు

రోడ్డుపైనే అభ్యర్థుల నిరీక్షణ

అర్ధరాత్రికిగాని ఏలూరు చేరని బస్సులు

పట్టించుకునే నాథుడు లేక నానావస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నియామక పత్రాలు అందుకునేందుకు అమరావతికి వెళ్లిన డిఎస్‌సి అభ్యర్థులు గురువారం నరకయాతన అనుభవించారు. ఉదయం ఎనిమిది గంటలకు ఏలూరు నుంచి బస్సుల్లో బయలుదేరిన అభ్యర్థులు అర్ధరాత్రికిగాని ఏలూరు చేరుకోని పరిస్థితి ఏర్పడింది. సరైన ఆహారం లేక, పట్టించుకునే వారు కరువై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా సిఎంతో సమావేశం ముగిసిన తర్వాత అభ్యర్థుల గురించి పట్టించుకునే వారే లేకపోయారు. బస్సులు ఎక్కడ పెట్టారో ఏఒక్కరికీ తెలియని పరిస్థితి నెలకొంది. అక్కడే రోడ్లపై రాత్రి 9 గంటల వరకు వేచిచూస్తూనే ఉన్నారు. ఒకపక్క ఆకలి, మరోపక్క ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి అందరినీ ఆందోళనకు గురి చేసింది. ముఖ్యంగా మహిళా అభ్యర్థుల అవస్థలు వర్ణనాతీతం. బస్సులకు ఇన్‌ఛార్జీలుగా నియమించిన అధికారులకు సైతం బస్సులు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. బస్సు సిబ్బంది ఫోన్లు ఎత్తకపోవడంతో బస్సులు వస్తాయో, రావో అనే ఆందోళన ఏర్పడింది. జిల్లా నుంచి దాదాపు 1100 మందికి పైగా అభ్యర్థులు, వారి కూడా ఒక్కొక్కరు చొప్పున కుటుంబీకులు సుమారు రెండు వేల మందికిపైగా వెళ్లారు. వీరంతా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నలుమూలల నుంచి ఏలూరు వచ్చినవారే. సిఎం సభ దాదాపు ఐదు గంటలకు ముగిసినప్పటికీ రాత్రి తొమ్మిది, పది గంటల వరకు బస్సులు మాత్రం రాలేదు. దీంతో అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లా నుంచి వచ్చిన అధికారులు తమను సరిగా పట్టించుకోలేదనే అభిప్రాయం అందరిలోనూ నెలకొంది. దీంతో విద్యాశాఖ అధికారులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ముందు రోజు బుధవారం సైతం ఏలూరులో కేటాయించిన పది స్కూళ్లలోను సక్రమంగా ఏర్పాట్లు చేయని విషయం తెలిసిందే. గురువారం అమరావతి నుంచి ఇక్కడికి తీసుకురావడంలోనూ తీవ్ర నిర్లక్ష్య ధోరణి కనిపించింది. అర్ధరాత్రి ఏలూరు చేరుకున్న అభ్యర్థులు ఇళ్లకు వెళ్లేందుకు నరకయాతన అనుభవించారు. అధికారులకు సరైన ప్రణాళిక లేకపోవడం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందనే చర్చ అభ్యర్థుల్లో సాగింది.

జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో
భూసేకరణ నిలుపుదల చేయాలి

ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ ఛైర్మన్, ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో భూ సేకరణ నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ ఛైర్మన్, ఆదివాసీ ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు అధ్యక్షతన ఆదివాసీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే వివాదాల్లో ఉన్న వేల ఎకరాల భూములను సేకరించి పోలవరం నిర్వాసితులకు కేటాయించటం వల్ల భూవివాదాలతో గొడవలు జరుగుతున్నాయన్నారు. షెడ్యూల్ ప్రాంతమైన వనరులు లేక, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగంతో ఆదివాసీలు దుర్భరమైన జీవితం గడుపుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జీలుగుమిల్లి, బుట్టాయగూడెం రెండు మండలాల్లోకి ఏడు మండలాల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను తీసుకొచ్చి పునరావాసం కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెద్ద మొత్తంలో ప్రభుత్వ సొమ్మును దోచుకోవడానికి, ఎల్‌టిఆర్ భూములను సేకరించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, దళారులు పడుతున్న తాపత్రయం, హడావుడి చూస్తుంటే భారీ కుంభకోణం జరగబోతుందని అర్థమవుతుందన్నారు. వెంటనే జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో భూ సేకరణ నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా, వైఎస్ఆర్ జిల్లా రంపచోడవరం డివిజన్ షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న కొయ్యలగూడెం, గోపాలపురం, చింతలపూడి, నల్లజర్ల, గోకవరం తదితర మైదాన ప్రాంత మండలాల్లో ఉన్న అడవులను సేకరించి పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఆ ప్రాంతాన్ని షెడ్యూల్ ప్రాంతంగా నోటిఫై చేయాలని డిమాండ్ చేశారు. మరొక ముఖ్యఅతిథి ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు మాట్లాడుతూ జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం, పోగొండ రిజర్వాయర్, జల్లేరు రిజర్వాయర్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వన్యమృగాల అభయారణ్యం, 366 బిబి జాతీయ రహదారి ఇలా అనేక ప్రాజెక్టుల వల్ల ఈ రెండు మండలాల్లో జనసాంద్రత పెరిగి నిరుద్యోగం, ఉపాధి లేకపోవడం వల్ల తీవ్రమైన ఆవేదనతో ఉన్న ఆదివాసీలకు మరో శాపంగా ఆయుధ డిపో తీసుకురావడం ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను నాశనం చేయడం, ఆదివాసీలను తీవ్రంగా అణిచివేయడమే లక్ష్యంగా కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడుసార్లు గ్రామసభ వ్యతిరేకంగా తీర్మానించినప్పటికీ అధికారులు, పార్లమెంటు సభ్యులు, ప్రజాప్రతినిధులు ఆదివాసీ అభిప్రాయాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవటం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తెల్లం గంగరాజు, జిల్లా కార్యదర్శి కోర్స నాగేశ్వరరావు, కుంజా రమేష్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పూసం శ్రీను, కారం వెంకటేశ్వరరావు, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తెల్లం శ్రీనివాసరావు, ఆదివాసీ నాయకులు కంగాల శ్రీనివాసరావు, మడకం దుర్గారావు, చోడెం దుర్గారావు, మడకం రమేష్, కొమరం రాము, బుద్ధులు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ తరలిన డిఎస్‌సి అభ్యర్థులు

అక్టోబర్ మొదటి వారంలో అపాయింట్‌మెంట్ లెటర్లు

బస్సులో విజయవాడ వెళ్తున్న డిఎస్‌సి అభ్యర్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి-2025లో జిల్లా నుంచి ఎంపికైన అభ్యర్థులు గురువారం ఉదయం విజయవాడ తరలివెళ్లారు. వెలగపూడిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సిఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా వారంతా డిఎస్‌సికి ఎంపికైనట్లు లేఖలు అందుకున్నారు. ఏలూరు జిల్లాలో ఎంపికైన 1063 మందితోపాటు జిల్లా నుంచి ఇతర జోన్లకు ఎంపికైన 83 మంది కలిపి మొత్తం 1146 మంది బుధవారం సాయంత్రం ఏలూరు చేరుకుని వారికి కేటాయించిన కేంద్రాల్లో రాత్రి బస చేసి, గురువారం ఉదయం వారికి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో వెలగపూడి వెళ్లారు. ప్రస్తుతం వెలగపూడి సభలో వారు డిఎస్‌సికి ఎంపికైనట్లు లేఖలు అందుకున్నారు. అక్టోబర్ మొదటి వారంలో వారందరికీ శిక్షణ ఇచ్చిన అనంతరం కౌన్సెలింగ్ ద్వారా వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందించనున్నారు. కౌన్సెలింగ్ ఆన్‌లైన్ జరుగుతుందా లేదా ఆఫ్‌లైన్ జరుగుతుందా అన్నది ఇంకా తెలియాల్సిన అవసరం ఉంది.

ఎక్సైజ్ నేరాలు అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక

ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎ.ఆవులయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దసరా సందర్భంగా ఎక్సైజ్ నేరాలు అరికట్టడానికి ప్రత్యేక ప్రణాళికలో భాగంగా జిల్లాలో గురువారం జరిపిన దాడుల్లో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత ఆదేశాల మేరకు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం, నామవరం, సీతానగరం, చింతలపుడి గ్రామాల్లోని నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు జరిపి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఎనిమిది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాగిరెడ్డిగూడేనికి చెందిన వడిత్య పున్న, బనావతు లలిత, వడిత్య చిలకమ్మ, నామవరానికి చెందిన భుక్య లక్ష్మిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏలూరు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది, ఏలూరు, భీమడోలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. ప్రజలు నాటుసారా, అక్రమ మద్యం, కల్తీ మద్యంలకు సంబంధించిన ఎటువంటి సమాచారమైన 9440902425, 9440902426, టోల్ ఫ్రీ నెంబర్ 14405కు తెలియజేయాలని కోరారు. పండగ సందర్భంగా లైసెన్సు కలిగిన మద్యం దుకాణాల్లో మాత్రమే ప్రజలు మద్యం కొనుగోలు చేయాలని కోరారు.

యుటిఎఫ్ రణభేరికి తరలిన ఉపాధ్యాయులు

జీలుగుమిల్లిలో..

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరులో గురువారం నిర్వహించిన రణభేరి బహిరంగ సభకు మండలం నుంచి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివెళ్లారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు తెలిపారు. మండల నలుమూలల నుంచి ఉపాధ్యాయులు వివిధ వాహనాల్లో బహిరంగ సభకు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధేనేతర పనుల నుంచి విముక్తి కలిగించి, ఒత్తిడి లేకుండా పని చేసేల చూడాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, తదితర సమస్యలపై జరిగే మహాసభలో ప్రసంగించినట్లు తెలిపారు. కార్యక్రమానికి వెళ్లిన వారిలో యుటిఎఫ్ మండలాధ్యక్షులు ఎం.పోసమ్మ, కార్యవర్గ సభ్యులు చెన్నరావు, సోమేశ్వరరావు, మల్లయ్య, జయరాజు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరావు, సత్యవతి, శాంతికుమారి, సరోజ, అరుణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన్ మందిర్‌లో గురువారం జరగనున్న రణభేరి కార్యక్రమానికి పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం నుంచి సుమారు 50 మంది ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, నూజివీడు మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాబూరావు, చెన్నకేశవరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు జి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకొచ్చి 15 నెలలు గడుస్తున్నా మాట్లాడటానికి, చర్చించడానికి అధికారులు, పాలకులు, మంత్రులు ముందడుగు వేయడం లేదంటే లెక్కలేని తనమా అని ప్రశ్నించారు. అందుకోసం అందరం ఏకతాటిపై ప్రభుత్వ విద్యారంగాన్ని మన హక్కులను కాపాడడానికి ఉద్యమ మార్గం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నూజివీడులో...

బాలిక కాలిపై ఎక్కిన ఆర్‌టిసి బస్సు

రద్దీకి సరిపడా బస్సులు నడపాలని విద్యార్థులు, ప్రయాణికుల డిమాండ్

బస్టాప్ వద్ద ప్రయాణికుల రద్దీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు బస్టాప్ వద్ద ఓ బాలిక బస్సు ఎక్కేందుకు వేచి ఉంది. ఆ బాలిక కాలిపై రావులపాలెం నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఎకడంతో తీవ్ర గాయమైంది. ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేయడంతో స్థానికులు బస్సును ఆపేశారు. ఉచిత బస్సు కారణంగా బస్సులు విపరీతంగా రద్దీగా నడుస్తున్నాయి. దసరా సెలవుల నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులు తమ స్వగ్రామాలకు వెళ్లనున్న నేపథ్యంలో మరింత రద్దీ నెలకొంది. ఈ నేపథ్యంలో బస్సు కోసం ప్రయాణికులు ఎక్కేందుకు గుమిగూడారు. ఈ క్రమంలో బస్సు నెమ్మదిగా కదిలి బాలిక కాలిపై ఎక్కేసింది. బాలికను హైవే పెట్రోలింగ్ సిబ్బంది అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికుల రద్దీకి సరిపడా బస్సులను నడపాలని విద్యార్థులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న సుజాత

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుజాత చెప్పారు. మండలంలోని బలివే అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. పోషణ మహ వేడుకల్లో పాల్గొని గర్భిణులను ఉద్దేశించి మాట్లాడుతూ సమతుల ఆహారం, పోషణ గురించి వివరించారు. గర్భిణులకు సీమంతం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ రాజకుమారి, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుక్కునూరు : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా గురువారం కొర్లకుంట అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపిఒ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థూలకాయం, ఆరోగ్యకరమైన జీవన శైలి, పోషకాహార అలవాట్లపై అవగాహన కల్పించారు. ఉప్పు, పంచదార, మైదా వంటి తెల్లని పదార్థాల వినియోగాన్ని తగ్గించాలన్నారు. వయసుకు తగిన బరువు నిర్వహణ ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులకు, చిన్నపిల్లలకు అవసరమైన పోషకాహారం, తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల గురించి సమాచారం అందించారు. అనంతరం, ఆరోగ్యకర జీవనం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్.లక్ష్మీకుమారి, సూర్యకాంతం, వెంకటలక్ష్మి, గర్భిణులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ముసునూరు ఎంపిడిఒగా ఏసుబాబు

ప్రజాశక్తి - ముసునూరు

బాధ్యతలు చేపడుతున్న ఏసుబాబు

ముసునూరు ఎంపిడిఒగా పి.ఏసుబాబు బాధ్యతలు చేపట్టారు. ఆయన ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిలో భాగంగా ముసునూరు ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ముసునూరు ఎంపిడిఒగా పనిచేసిన బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఇఒపిఆర్‌డిగా తమ బాధ్యతల్లో భాగంగా విధి నిర్వహణలో పాల్గొన్నారు. ఎంపిడిఒ ఏసుబాబు మాట్లాడుతూ మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అవగాహనా ర్యాలీలో విద్యార్థులు

మందులపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా ఫార్మసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పి.జాన్‌బాబు ఆధ్వర్యంలో గురువారం ముదినేపల్లిలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ వీరభద్రరావు, ఎంపిడిఒ వై.రామకృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. విజయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, వికాస్ డిగ్రీ కాలేజీ విద్యార్థులతో ముదినేపల్లిలో మందులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మనోజ్, విజయ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపల్ వినయ్‌కుమార్, డాక్టర్ పవన్, వికాస్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కనక మోహన్‌రావు, ఏకే హాస్పిటల్ మేనేజర్ కిరణ్, ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్, ముదినేపల్లి మందుల షాపుల నిర్వాహకులు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై దృష్టి పెట్టాలని తహశీల్దార్ ఉదయ్ భాస్కర్ బిఎల్ఒలను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలని, 2002 సంవత్సరం నుంచి ఉన్న ఓటర్ జాబితాను పున:పరిశీలించి 35 సంవత్సరాలు నిండిన ఓటర్ల వివరాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది షరీఫ్, శివ, నిఖిల్, మండలంలోని పలువురు బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వివరాలు తెలుపుతున్న పోలీసులు

పశువుల చోరీ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను అదుపులోకి తీసుకున్నారు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భీమడోలు పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల దొంగతనాల్లో ప్రధాన నిందితునిగా ఉన్న పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన దుగ్గెంపూడి అశోకరెడ్డితో పాటు సహ నిందితులుగా ఉన్న హర్యానా రాష్ట్రం మేవాడ్ జిల్లాకు చెందిన మరొక ముగ్గురిని భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగిలించిన పశువులను తరలించేందుకు వినియోగిస్తున్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు ప్రధాన నిందితునిగా ఉన్న అశోక్‌రెడ్డి హర్యానా జిల్లాకు చెందిన ముగ్గురితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. అశోక్ రెడ్డి నేతృత్వంలో వీరు వివిధ ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహించి పశువులను దొంగతనం చేయడం, వీటిని చిలకలూరిపేటకు తరలించి అక్కడ ఒక ప్రాంతంలో భద్రపరిచి, ఆ తర్వాత క్రమంలో పశువులను విక్రయించేవారు. పశువులను తరలించే నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కామవరపుకోట మండలం సాగిపాడు గ్రామానికి చెందిన ముంగమూరి వందనంకు మండలంలోని వెలగపాడు గ్రామానికి చెందిన లలిత కుమారితో వివాహమైంది. వివాహ సమయంలో రూ.50 వేల నగదు, 50 సెంట్ల భూమి కట్నంగా ఇచ్చారు. వివాహమైన తర్వాత 13 ఏళ్ల వందనం భార్యను బాగానే చూసుకున్నాడు. ఇటీవల వ్యసనాలను బానిసైన అతను పుట్టింటి నుంచి మళ్లీ కట్నం తేవాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, అంతేకాకుండా ఈ నెల ఒకటో మండలంలోని వెలగపాడులో లలిత పుట్టింటి వద్ద ఉండగా బాగా మద్యం తాగివచ్చి గొడవ పడ్డాడు. భార్య లలితకుమారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మండల సర్వేయర్‌ను నియమించరూ..!

ఆర్అండ్ భూముల సేకరణలో అవకతవకలు!
అన్యాయం జరుగుతుందని గిరిజనుల ఆవేదన
ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెంలో ఇన్‌ఛార్జి మండల సర్వేయర్‌తోనే ప్రభుత్వం నెట్టుకొస్తుంది. టి.నరసాపురం మండల సర్వేయర్ దుర్గయ్యను ఇన్‌ఛార్జి మండల సర్వేయర్‌గా నియమించింది. బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ లేరు. దీంతో గతంలో బుట్టాయగూడెం మండల సర్వేయర్‌గా పనిచేసిన దుర్గయ్యను ఇన్‌ఛార్జి సర్వేయర్‌గా నియమించారు. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం గ్రామంలో జరుగుతున్న ఆర్అండ్ఆర్ భూముల కొనుగోలులో ప్రధాన పాత్ర సర్వేయర్‌దే ఉంటుంది. ఎందుకంటే గిరిజనేతరుల నుంచి భూములను కొనుగోలు చేసే సమయంలో గిరిజనులు ఆ భూముల్లో సాగులో ఉన్నారో లేదో సర్వేయర్‌కు తెలుస్తుంది. అదే విధంగా గిరిజనేతరులు రికార్డులు సవ్యంగా ఉన్న భూములను భూసేకరణకు ఇస్తున్నారా లేదా చూసుకోవాలి. రికార్డుల ప్రకారం ఎక్కువ భూములను చూపించి కొలతలు లేకుండా భూములను తీసుకోవడంతో కూనవరం నుంచి నిర్వాసితులుగా వస్తున్న గిరిజనులకు భూములు తక్కువగా ఉండడంతో తీవ్ర అన్యాయం నష్టం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం ఆర్అండ్ఆర్ ద్వారా భూములను కొనుగోలు చేయడం కోసం ముందుకొచ్చింది. అదే సమయంలో బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌ను ఎందుకుక నియమించలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎంతో మంది తమ భూములను సర్వే చేయాలని కోరుతూ పలుమార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా మండల సర్వేయర్ అందుబాటులో లేని కారణంగా సర్వే చేయడం లేదు. సాధారణ భూములను సర్వే చేయడానికి సర్వేయర్లు అందుబాటులో ఉండడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గిరిజనుల కోసం కొనుగోలు చేస్తున్న భూములను సర్వే చేయకుండా మండల సర్వేయర్ లేకుండా ఏవిధంగా కొనుగోలు చేస్తారని పలువురు విమర్శిస్తున్నారు. ఆర్అండ్ఆర్ ద్వారా భూ సేకరణ చేయడంలో భాగమైన సర్వే సక్రమంగా చేయకపోయితే ప్రస్తుతం బుట్టాయగూడెం మండలంలో నివాసం ఉంటున్న గిరిజనులకు, పోలవరం నిర్వాసితులుగా కూనవరం నుంచి వస్తున్న గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రభుత్వాలు గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో రీ సర్వే కార్యక్రమాన్ని నామమాత్రంగానే జరిపి ప్రభుత్వం నుంచి వచ్చే సొమ్ములను దండుకున్నారని విమర్శలు చేస్తున్నారు. మండలంలో పూర్తిగా రీ సర్వే జరగలేదని చెబుతున్నారు. బుట్టాయగూడెం మండలంలో భూసేకణలో జరుగుతున్న అవకతవకల గురించి జిల్లా స్థాయి అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు పెదవిరుస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలో మండల సర్వేయర్‌ను నియమించకుండా ఇన్‌ఛార్జి సర్వేయర్‌ను ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శిస్తున్నారు. రెడ్డి గణపవరంలో జరుగుతున్న అక్రమ భూ కొనుగోలులో అధికారులను విచారించి సరైన పద్ధతిలో భూ కొనుగోలు చేయాలని, అదేవిధంగా అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను సస్పెండ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. రెడ్డి గణపవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆర్అండ్ఆర్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న భూముల్లో జరుగుతున్న అక్రమాలను, అవకతవకలను ఎండగడుతూ ఒక వీడియోను పోస్ట్ చేశాడు. ప్రభుత్వం భూములను కొనుగోలు చేసేటప్పుడు భూమిని సర్వే చేసి పూర్తిగా కొలతలను కొలిచిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

శానిటేషన్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

పలుచోట్ల స్వచ్ఛతా హి సేవ-2025 కార్యక్రమాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

శానిటేషన్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. స్వచ్ఛతా హి సేవ-2025 కార్యక్రమంలో భాగంగా జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని శానిటేషన్ కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పలు రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మణికంఠేశ్వర్, పవన్, ల్యాబ్ టెక్నీషియన్ మంగతయారు, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చింతలపూడి ఎంఎల్ఎ ఆదేశాల మేరకు పట్టణంలో స్థానిక సాయిబాలాజీ టౌన్ షిప్‌లో స్వచ్ఛా భారత్ స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, కౌన్సిలర్లు తెలగారపు జ్యోతి, కరుటూరి రమాదేవి, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, షేక్ ముస్తఫా, గుమ్మడి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రమణ, చిట్రోజు తాతాజీ, కంపా రాజేంద్ర, కరణం రాంబాబు, సుంకర లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో...

చింతలపూడి : పరిసరాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు అన్నారు. పట్టణంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచత హి సేవ-2025 కార్యక్రమంలో భాగంగా ఒక రోజు, ఒక గంట ఒకే సమయం అనే థీమ్ కింద ప్రత్యేక శ్రమదానం కార్యక్రమం నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలో చింతలపూడి మిని బస్టాండ్ వద్ద గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సొసైటీ ఛైర్మన్ తిరిమిల్లి రామారావు, టిడిపి పట్టణ కార్యదర్శి బోడా నాగభూషణం, నత్త రవికుమార్, సత్తిబాబు, కూటమి నాయకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో...

భీమడోలు : మండల వ్యాప్తంగా పుర ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాత్ కార్యక్రమాన్ని వివిధ శాఖల సమన్వయంతో అన్ని గ్రామ పంచాయతీల్లో చేపట్టామన్నారు. దీనిలో భాగంగా పరిశుభ్రత మెగా డ్రైవ్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణ క్యాంపులు, అందరి భాగస్వామ్యంతో మానవహారాలు ఏర్పాటు చేయడం, అవగాహనా సదస్సులు నిర్వహించడం చేపట్టామన్నారు. అనంతరం పొలసానిపల్లిలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ మెబైల్ క్యాంపును సందర్శించి మెరుగైన పనితీరుకు తగు సూచనలు చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

ఆర్‌సిఎం చర్చి నిర్మాణానికి టైల్స్ అందిస్తా

మల్లుకుంట సొసైటీ ఛైర్మన్ శీలం సాయివినయ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆర్‌సిఎం చర్చి నిర్మాణానికి రూ.లక్ష విలువైన టైల్స్ బహుకరిస్తానని మల్లుకుంట సొసైటీ ఛైర్మన్ టిడిపి యువ నాయకుడు శీలం సాయి వినయ్ హామీ ఇచ్చారు. మండలంలోని వీరభద్రవరంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌సిఎం చర్చిని గురువారం సందర్శించిన ఆయన చర్చి ఫాదర్, సంఘ విశ్వాసులు, పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా చర్చి నిర్మాణానికి సాయం అందించాలని వారు కోరడంతో స్పందించిన సాయివినయ్ మాట్లాడుతు నిర్మాణానికి అవసరమైన టైల్స్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆయనకు సంఘ విశ్వాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ యేసుపాదం, సంఘ పెద్దలు, గంటా ధర్మారావు, ఎడ్లపల్లి సీతారాములు, గంటా వెంకటేశ్వరరావు, గెడ్డం బాలరాజు, గంటా భరత్, గెడ్డం నాగేంద్ర పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి

జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఈశ్వరయ్య

మాట్లాడుతున్న మేకా ఈశ్వరయ్య

ప్రజాశక్తి - చింతలపూడి

జనసేన పార్టీ చింతలపూడి నియోజవకర్గంలో అంతర్గత కలహాలు అనిసోషల్ మీడియాలో అసత్య ఆరోపణలతో వీడియోలను పెడుతూ, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న తూము విజయ్‌కుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్టానికి, జిల్లా నాయకత్వానికి పూర్తి వివరాలతో నివేదిక ఇచ్చినట్లు నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య తెలిపారు. చింతలపూడి జనసేన పార్టీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూము విజయ్‌కుమార్ చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ పదవి ఆశించారని, ఆయనకు ఆ పదవి దక్కకపోవడంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో తూము విజయ్‌కుమార్ పార్టీపై చేసే ఆరోపణలు ఆయన వ్యక్తిగత ఆరోపణలు తప్ప ఆయనకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తూము విజయకుమార్ కూటమి ప్రభుత్వంలో పార్టీల మధ్య అంతర్గతంగా చిచ్చుపెట్టే విధంగా జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబుపై, ఆయన కుటుంబంపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నట్లు పార్టీ దృష్టికి వచ్చిందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడినవారికి పదవులు దక్కుతాయన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి గ్రూపులు లేవని, అందరం కలిసికట్టుగానే పని చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో జనసేనపై, నాయకులుపై తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు.

జీవిత బీమా పథకాలు వినియోగించుకోండి

ఆర్‌బిఐ ఆర్‌డి బషీర్

ప్రజాశక్తి - పోలవరం

బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి వ్యక్తి బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బిఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ తెలిపారు. పోలవరం మండలంలోని పాత పట్టిసీమ గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌బిఐ ఆర్‌డి బషీర్, ఎల్‌డిఒ నవీన్, కెనరా బ్యాంక్ డిజిఎం మాధవరావు, ఎస్‌బిఐ డిజిఎం పంకజ్‌కుమార్, ఆర్ఎం రమేష్‌నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా బషీర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంక్ ఖాతాలను సమయానికి ఇ కెవైసి చేయించుకోవాలని, తద్వారా లావాదేవీల్లో ఎటువంటి అంతరాయం లేకుండా సులభంగా సేవలు పొందవచ్చని సూచించారు. సామాజిక భద్రతా పథకాలైన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన గురించి వివరించారు. గ్రామ ప్రజలు ఈ పథకాలపై ప్రశ్నలు అడగగా, అధికారులు వాటి ప్రయోజనాలను, చేరిక విధానాన్ని వివరించారు. దీంతో గ్రామస్తులకు సమయాన్ని, ఖర్చును ఆదా చేసుకోవచ్చని వివరించారు. గ్రామ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత కేవలం వ్యక్తిగత ప్రయోజనానికి మాత్రమే కాకుండా, కుటుంబం, సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలియజేసి, అందరూ డిజిటల్ బ్యాంకింగ్, భద్రతా చర్యలు, ప్రభుత్వ పథకాల సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూటాల కెనరా బ్యాంక్ మేనేజర్ కె.శ్రీకాంత్, విఒఎలు, గ్రామస్థాయిలోని స్వయంసహాయక సంఘాల మహిళలు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు, పోలవరం ఎస్‌బిఐ మేనేజర్ రవికుమార్, పట్టిసీమ సర్పంచి సబ్బారపు శ్రీరామమూర్తి, కొత్త పట్టిసీమ సర్పంచి మైగాపులు విజయదుర్గ, ఎపిఎం జేమ్స్, వ్యవసాయ అధికారి రాంబాబు, గూటాల సర్పంచి శ్రీనివాసరావు, మైగాపుల దుర్గాప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్స్ అనిల్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్ రవీంద్ర దుర్గా, చెన్నారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బషీర్

మహిళలు కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలి

నూజివీడులో...

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని దిగవల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ స్వసక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం దిగవల్లి పిహెచ్‌సిలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ 18 నుంచి 49 ఏళ్ల మహిళలందరూ తప్పనిసరిగా క్యేన్సర్ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. వైద్య శిబిరాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ జాస్తి జగన్మోహన్‌రావు సందర్శించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ముసునూరు : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది డ్రైవ్ నిర్వహించడం చాలా ఆనందదాయకమని సొసైటీ ఛైర్మన్, టిడిపి గ్రామ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామ సచివాలయంలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు షకీలా ఇవాంజిలిన్, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యంగా బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన, అనారోగ్యం బారిన పడిన వారికి వైద్య సలహాలు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మండవల్లి : ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కూటమి నాయకులు చలసాని కోటయ్య, నిమ్మగడ్డ బుజ్జి స్పష్టం చేశారు. మండలంలోని ఉనికిలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అనంతరం మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్తుతి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఎం.ఝాన్సీ, ఎఎన్ఎం సీతామహాలక్ష్మి, కెవైఎస్ఎపి సిబ్బంది, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వి.ప్రశాంతి, మంజు బేబీ సరోజిని, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో...

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

పెదవేగి మండలం విజయరాయి సెక్షన్ కొప్పాక సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న అమ్మపాలెం, పెదకడిమి, కొప్పాక, అంకన్నగూడెం గ్రామాలకు సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్య, ఉద్యోగంతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి - దెందులూరు

విద్య, ఉద్యోగం అనేవి వ్యక్తి జీవితాన్నే కాకుండా ఆ కుటుంబం భవిషత్తునే మార్చేస్తాయని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా డిఎస్‌సి విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన అతిథిగా హాజరైనట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెగా డిఎస్‌సి-2025 నోటిఫికేషన్‌లో దెందులూరు నియోజకవర్గం మాత్రమే కాకుండా ఇతర నియోజకవర్గాల నుంచి కూడా వచ్చిన దాదాపు 500 మందికి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ వందరోజులపాటు మెగా డిఎస్‌సిపై రాష్ట్రస్థాయి అత్యుత్తమ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శిక్షణ పొందిన వారిలో 38 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఆ 38 మందిని చింతమనేని ఇటీవల ప్రత్యేకంగా సత్కరించడమే కాకుండా, ఉద్యోగం పొందని మిగతావారికి కూడా రానున్న ప్రతి నోటిఫికేషన్‌లో కూడా అవసరమైన శిక్షణను అందించి వారికి కూడా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

మెగా డిఎస్‌సి సువర్ణ అధ్యాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్ర చరిత్రలో మెగా డిఎస్‌సి సువర్ణ అధ్యాయమని టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ అన్నారు. జంగారెడ్డిగూడెం తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిఎస్‌సికి ఎంపికైనవారికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా అందించడం చాలా శుభ పరిణామమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక మెగా డిఎస్‌సి ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఆ తర్వాత అన్ని అవాంతరాలను అధిగమించి రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ మెగా డిఎస్‌సిని విజయవంతంగా ముందుకు నడిపించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటి వరకు ఒకసారి చరిత్రను పరిశీలిస్తే డిఎస్‌సిల ఛాంపియన్ చంద్రబాబునాయుడేనని స్పష్టమవుతోందన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **ANUDEEPIKA GORRE**, D/o **GORRE NARESH KUMAR**, residing at D.No. 3-119, Ambala cheruvu gattu, Kaza east, Yelamanchili Mandal, W.G Dt, A.P, 534260 changed my name **ANUDEEPIKA ANISETTI** D/o **ANISETTI RAMA CHANDRA RAO, ANISETTI SUBHAVATHI** to **ANUDEEPIKA GOREE** D/o **GORRE NARESH KUMAR, GORRE SUBHAVATHI**. Henceforth, all my documents, passport etc. will be continued with my new name and my current parents names as **ANUDEEPIKA GORRE** D/o **NARESH KUMAR GORRE, SUBHAVATHI GORRE**.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నర్సాపురం వారి కోర్టులో,
Creditor I.P.No. 14/2025

బిట్వీన్:
దొడ్డా లక్ష్మీనారాయణ, S/o. సూర్యచంద్రరావు, బిజినెస్, లయన్స్ నగర్, పాలకొల్లు రూరల్, పాలకొల్లు, ప॥గో॥జిల్లా. ...పిటీషనర్

అండ్

1. **పోతుల స్వాతి నాగ హనుమావతి,** W/o. లేట్ వెంకట సత్యనారాయణ, డోర్ నెం. 1-62, వరిధనం గ్రామం, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.
2. **పోతుల రమ్య లక్ష్మీ ప్రహర్ష,** D/o. లేట్ వెంకట సత్యనారాయణ, మైనర్, డోర్ నెం.1-62, వరిధనం గ్రామం, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.
3. **పోతుల వైశావ్య,** D/o. లేట్ వెంకట సత్యనారాయణ, మైనర్, డోర్ నెం.1-62, వరిధనం గ్రామం, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.
4. **సాధనాల వెంకటలక్ష్మి,** W/o. రామారావు, డోర్ నెం. 1-192/4, గాయత్రీ నగర్, మొగలికుదురు గ్రామం, మామిడికుదురు మండలం, Dr.బి.ఆర్. అంబేద్కర్ జిల్లా.
5. The Official Receiver, West Godavari District, Eluru

వాయిదా: 07-10-2025

నర్సాపురం
Date: 25-09-2025

D. Subrahmanyem
Advocate, Palakol
Cell: 98491 73674